సంతకంలా గూడు.. రంగుల్లో ఆకట్టుకుంది సాలీడు

సాధారణంగా సాలీడు బూడిద రంగులో ఉంటుంది. నాగారం మండలంలోని నాగారం, డి.కొత్తపల్లి, ఫణిగిరి గ్రామాల్లో పసుపు, తెలుపు, ఊదా రంగులోని సాలీడులు కనిపించాయి. ఇవీ విభిన్నంగా ఎక్స్, జిగ్‌జాగ్‌గా ఆకారాల్లో నిర్మించిన గూళ్లను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. 'ఇవి ఆరనిడే కుటుంబానికి చెందినవని, **సిగ్నేచర్ స్పైడర్** అంటార'ని డి.కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని హేమామాలిని 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సాధారణంగా ఇండియా, పాకిస్థాన్, నేపాల్, శ్రీలంక, బ్రెజిల్ దేశాల్లో కనిపిస్తాయని, తన శరీరం కంటే రెండింతల బరువు గల చిన్న కీటకాలను చంపి ఆహారంగా తీసుకుంటాయని వివరించారు.



డి.కొత్తపల్లిలో గూడును అల్లుకుంటున్న సాలీడు

–నాగారం, న్యూస్‌టుడే:

నేటి నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజక వర్గ శాసన మండలి ఎన్నికకు ఓటరు నమోదు ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 30 నుంచి నవంబరు 6వ తేదీ వరకు ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఫారం-19 ద్వారా ఆఫ్‌లైన్‌లోనూ, ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలలు, అన్ని రకాల కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో పాటు నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు సైతం ఓటు నమోదుకు అర్హులు.

నత్తనడకన ఎల్ఆర్ఎస్ ప్రక్రియ

☛ దరఖాస్తులు వేలల్లో.. క్రమబద్ధీకరణ వందల్లో

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. పట్టణాల్లో స్థలాలు కొనుగోలు చేసిన వారు నాలుగేళ్ల కింద ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు. ఇటీవల ప్రభుత్వం దరఖాస్తుల క్రమబద్ధీకరణకు పచ్చజెండా ఊపింది. వీటి పరిష్కారానికి ప్రత్యేక బృందాలను నియమించి. వేలల్లో దరఖాస్తులు రావడంతో వందల్లోనే పరిష్కారం చూపారు. జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి పుర పాలికలు ఉన్నాయి. ఈ ఐదు పుర పాలికల్లో కలుపుకొని 66,058 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఎల్-1, ఎల్-2, ఎల్-3 దశలో పరిశీలన చేసి పరిష్కరించాల్సి ఉంది. మొత్తం ఐదు పురపాలికలకు 66,058 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 754 దరఖాస్తులు మాత్రమే పరిష్కరించారు.

సూర్యాపేటలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల స్థలాన్ని పరిశీలిస్తున్న పుర కమిషనర్ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ అధికారులు

బృందాలు నియమించినా

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కారానికి అధికారులు ఎల్-1 దశలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారి, రెవెన్యూ, నీటి పారుదలశాఖ సిబ్బందిని నియమించారు. వీరు క్షేత్రస్థాయిలో స్థలాల వద్దకు వెళ్లి పరిశీలన చేసి దరఖాస్తులకు ఆమోదిస్తారు. కానీ దరఖాస్తులు మాత్రం వేలల్లోనే పేరుకుపోతున్నాయి. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణతో పురపాలికలకు ఆదాయం సమకూరే అవకాశం ఉన్నా ఆ దిశగా అడుగులు పడటం లేదు. దరఖాస్తుదారులు కూడా విముఖత చూపుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పురపాలికల్లోని పట్టణ ప్రణాళిక విభాగంలో సిబ్బంది కొరత ఉంది. వీటన్నింటి కారణంగా కొంత జాప్యం జరుగుతున్నట్లు అధికారులు వాపోతున్నారు.

పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

–శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకుంటాం. దరఖాస్తుదారులు కూడా పురపాలికల్లోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను సంప్రదించి క్రమబద్ధీకరించుకోవాలి. పురపాలికల్లో సిబ్బంది కొరత కూడా కొంత కారణంగా జాప్యమవుతుంది. వీటన్నింటిని ఉన్నతాధికారులకు వివరిస్తాం.

దరఖాస్తుల వివరాలు

పట్టణం	దరఖాస్తులు	క్రమబద్ధీకరించినవి
సూర్యాపేట	35631	402
కోదాడ	16798	350
హుజూర్‌నగర్	4424	2
నేరేడుచర్ల	3152	0
తిరుమలగిరి	6033	0

నీటి వనరుల రక్షణకు అడుగులు

❑ ఆక్రమణల గుర్తింపునకు కదిలిన యంత్రాంగం

ఈనాడు, నల్గొండ – న్యూస్‌టుడే, నల్గొండ పురపాలిక : ప్రభుత్వ ఆదేశాలతో నీటి వనరులకు రక్షణగా అధికార యంత్రాంగం కదులుతోంది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోని నీటి వనరుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ఆక్రమణలు ఏమైనా ఉన్నాయా, కబ్జాలకు గురయ్యాయా.. అనే వివరాలను సేకరిస్తున్నారు. మరోవైపు ఏళ్లుగా ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఈ సర్వేలతో ఆందోళన చెందుతున్నారు.

సూర్యాపేట సద్దుల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పరిధిలో ఇటీవల సర్వేకు వెళ్లారు. బాధితులు సర్వేను అడ్డుకోవడంతో పాటు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో జనావాసం లేని ప్రాంతాల్లో చెరువులను ఆక్రమించి స్థిరాస్తి వ్యాపారం చేస్తూ వెంచర్లు వేసిన వాటిని తొలి దశలో సర్వే చేయనున్నట్లు తెలిసింది. పురపాలికల్లో రెవెన్యూ, నీటిపారుదల శాఖలతో కలిసి పుర అధికారులు, మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు ఈ సర్వేలు నిర్వహించనున్నట్లు తెలిసింది.

అనుమతుల్లేకుండానే నిర్మాణాలు

రెవెన్యూ శాఖలోని లొసుగులు, నీటిపారుదల, పురపాలిక అధికారుల నిర్లక్ష్యంతో చాలా చెరువుల్లోని శిఖం భూములు, ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతుల్లేకుండానే నిర్మాణాలు చేపట్టారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారితో పాటు నార్కట్‌పల్లి - అద్దంకి రహదారుల పక్కన ఉన్న చెరువులు గత పదేళ్లలో అనేకం కబ్జాకు గురయ్యాయి. స్థిరాస్తి వ్యాపారులకు స్థానిక రాజకీయ నాయకుల అండ ఉండటంతో ఈ క్రతువు గత పదేళ్లలో యథేచ్ఛగా సాగింది.

☛ నల్గొండ, చౌటుప్పల్, భువనగిరి, కోదాడ, మిర్యాలగూడ, బీబీనగర్, కోదాడ ప్రాంతాల్లో ఈ ఆక్రమణల దందా ఎక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లోనే అధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వగా... చాలా ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో నిర్మాణాలు చేపట్టారు.

నల్గొండ: కేశరాజుపల్లి మేడికుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన ప్రహరీ

కబ్జా దృష్టాంతాలు కొన్ని..

☛ నల్గొండ పురపాలిక పరిధి కేశరాజుపల్లిలో నార్కట్‌పల్లి -అద్దంకి రహదారి పక్కనే పాతపల్లెకు వెళ్లే మార్గంలో మేడికుంట చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలో రూ. కోట్లు విలువైన స్థలంలో కొందరు వ్యాపారులు ప్రహరీ నిర్మించారు. కతాల్‌గూడ చెరువు కనుమరుగవుతోంది.

పక్షం రోజుల్లో ఎక్కువ ఆక్రమణలున్న వాటిని గుర్తించి ఎంత మేరకు భూమి కబ్జాకు గురయిందో నిర్ధారించి తదుపరి చర్యలను సూచించాలని తెలుపుతూ సమగ్ర నివేదికను సర్కారుకు సమర్పించనున్నారు. ఉమ్మడి జిల్లాలో గత సర్వే ప్రకారం వివరాలు

మొత్తం చెరువులు, కుంటల సంఖ్య: 4454
50 శాతం కంటే ఎక్కువగా ఆక్రమణకు గురైనవి: 250
25 శాతం మేర అన్యాక్రాంతమైనవి: 500
మరికొన్ని చెరువులు పాక్షికంగా ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారు

☛ కోదాడ పెద్ద చెరువు సైతం సుమారు 200 ఎకరాల్లో కబ్జాకు గురైందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పెద్ద చెరువు అలుగుకు అడ్డంగా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతోనే ఇటీవల వరదలు వచ్చాయని ప్రభుత్వానికి అధికారులు నివేదిక సమర్పించారు.
☛ నకిరేకల్ పెద్దచెరువును రూ.6 కోట్ల వ్యయంతో మినీ ట్యాంక బండుగా అభివృద్ధి చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో సుమారు 40కిపైగా అక్రమ నిర్మాణాలున్నట్లు గతంలోనే అధికారులు గుర్తించారు.
☛ భువనగిరి, బీబీనగర్ మండలాల్లోనూ పలు చెరువులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి.
☛ చౌటుప్పల్ మండలంలోనూ పలు చెరువుల్లో స్థిరాస్తి వ్యాపారులు అక్రమ నిర్మాణాలు చేపట్టారు.
☛ సూర్యాపేట సద్దుల చెరువులో ప్రస్తుతం సర్వే కొనసాగుతోంది.
☛ హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లోనూ ఫిర్యాదులు వచ్చిన ఆక్రమణలపై అధికారులు సర్వే నిర్వహించనున్నారు.

వాగు నిండా చెత్త.. వరద పారేదెలా..?

ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ చౌట చెరువు అలుగు నుంచి వచ్చే వాగులో చెత్తాచెదారం పేరుకుపోవడం పెద్ద సమస్యగా మారింది. భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న శ్రీదండుమైసమ్మ దేవాలయాన్ని తాకుతూ వెళ్లే ఈ వాగు వ్యర్థాలతో నిండిపోయింది. ఫంక్షన్‌హాళ్ల నుంచి పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వస్తువులు, ఇతర వ్యర్థాలను పక్కనే ఉన్న వాగులో కొన్నేళ్లుగా భక్తులు పడేస్తున్నారు. దీంతో వాగు పొడవునా ప్లాస్టిక్ భూతం పోగవుతోంది. ఫలితంగా ఇటీవల వచ్చిన వరదలకు ఈ వ్యర్థాలు అడ్డంకిగా నిలిచాయి. వరద దారి మళ్లీ సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపైన మోకాళ్లోతు ఎత్తుతో ప్రవహించడంతో తారు రోడ్డంతా లేచిపోయింది. గతంలో వెడల్పుగా ఉండే వాగు ఏటేటా ఇరువైపులా ఆక్రమణలతో కుచించుకుపోతోంది. పెద్ద ఎత్తున అలుగు ద్వారా వచ్చే వరద ప్రవాహంలా మారి పొలాలను ముంచెత్తుతోంది.

నెమ్మికల్ చౌటచెరువు అలుగు వాగుపై నిర్మించిన కల్వర్టు గూనల్లో ఇరుక్కుపోయిన చెత్తాచెదారం

హద్దులు నిర్ణయించాల్సి ఉంది

–రామారావు, ఐబీ ఏఈ

రెవెన్యూ అధికారుల సహకారంతో వాగు హద్దులను ముందుగా నిర్ణయించాల్సి ఉంది. అనంతరం వాగు మరమ్మతుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. వాగులో పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించేందుకు సంబంధిత శాఖాధికారులు తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తాం.

–ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే:

పూడ్చకపోతే గాయాలే..!

పట్టణంలోని ఎన్‌హెచ్-65 రహదారి నుంచి మేళ్లచెరువు, కోదాడకు వెళ్లే సర్వీస్ రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ఆ గుంతల్లో పడి గాయాలైన ఘటనలూ ఉన్నాయి. ఇటీవల ఓ లారీ సైతం గుంతలో దిగబడటంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై సంబంధిత అధికారి మాల్యాద్రిని వివరణ కోరగా గుత్తేదారుతో మాట్లాడి త్వరలోనే పూడ్చి వేస్తామన్నారు. – కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

సీతజడ మెరిసె.. బంతి మురిసె

నెమ్మికల్ శివారులో కౌలు రైతు బానోత్ నాగులు నాయక్ సాగు చేసిన సీతజడ పూలతోట

కరాల విస్తీర్ణంలో బంతిపూలు, ఎకరంలో సీతజడ పూల తోటలు సాగు చేశారు. సీతజడ పూలతోట లేత గులాబీ రంగులో మెరుస్తూ రహదారిపై వెళ్లే ప్రయాణికులను ఆకర్షిస్తోంది. బంతిపూలు కిలో రూ.100, సీతజడ పూలు కిలో రూ.150ల చొప్పున విక్రయించనున్నట్లు రైతు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, ఆత్మకూర్(ఎస్)

కనువిందుగా బంతిపూల తోట

బహుమతులు, ధ్రువపత్రాలు అందుకున్న బాలబాలికలు

ఉత్సాహంగా చదరంగ పోటీలు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి చదరంగ పోటీలలో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా చదరంగ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-07 నుంచి అండర్-15 విభాగాలలో బాలబాలికలకు చదరంగ పోటీలు ఆదివారం నిర్వహించారు. పోటీలలో 124 మంది పాల్గొన్నారు. అండర్-15 విభాగంలో వై.రమ్య, అండర్-13 ఎం.దీక్షిత్, అండర్-11 రక్షిత్‌చారి, అండర్-9 బి.వాత్సవ్, అండర్-7 విభాగంలో సాయి కార్తికేయ విజేతలుగా నిలిచారు. వారికి బహుమతులు, పాల్గొన్న అందరికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చదరంగ అసోసియేషన్ కార్యదర్శి పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కె.నరసింహారావు, ఆర్బిటర్ ఎం.రవికుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఆన్ రేటెడ్ ప్రిన్సెస్ ఆఫ్ ది వరల్డ్ అవార్డు గ్రహీత దివ్య భవానిని సన్మానించారు.

యాదాద్రీశులకు భక్తుల దైవారాధనలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో భక్తజనుల ఆర్జిత పూజలతో పంచ నారసింహుల సన్నిధిలో ఆధ్యాత్మికత నెలకొంది. సుప్రభాతంతో వేకువజామున మొదలైన నిత్యారాధనలు రాత్రివేళ జరిపిన శయనోత్సవం కైంకర్యంతో తెరపడింది. మధ్యాహ్నం వరకు దైవదర్శనానికి భక్తులు బారులు తీరారు. పూజారులు మూలవరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసుదర్శన హోమం, నిత్య కల్యాణం, స్వర్ణ పుష్పార్చన, అలంకార సేవోత్సవాలు ఆలయ ఆచారంగా కొనసాగించారు. గర్భాలయంలో కొలువై ఉన్న స్వయంభువులను మహాముఖ మండపంలో దూరం నుంచే స్మరిస్తూ, భక్తులు భక్తితో దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీలక్ష్మీనరసింహస్వామి అలంకార సేవోత్సవాన్ని వేద, మంత్రాల మధ్య నిర్వహించారు. రాత్రి వేళ స్వయంభువులకు ఆరాధన, సహస్రనామార్చన నిర్వహించారు. అనుబంధంగా కొనసాగుతున్న శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శైవాగమ ఆచారంగా నిత్యపూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామిని కొలుస్తూ నిజాభిషేకం, తులసీ అర్చన, నిత్యకల్యాణం పాంచరాత్రాగమ శాస్త్ర రీత్యా నిర్వహించారు.

అసలే ఇరుకు ఆపై కొత్త ధాన్యం

రెండేళ్ల నాటి వడ్లను తీసుకెళ్లని గుత్తేదారు

మిల్లులను వేధిస్తున్న స్థలం సమస్య

హుజూర్‌నగర్‌లోని మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే:

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రస్తుత వానాకాలంలో వర్షాలు బాగా కురవడంతో వరి సాగు జోరందుకుంది. మరో వారం రోజుల్లో పంట చేతికి రానున్నందున కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే మిల్లుల్లో రెండేళ్ల నాటి యాసంగి ధాన్యం నిల్వ ఉంది. వాటిని తరలించకుంటే, స్థలం ఉండదని, ఇప్పుడు కొన్న వడ్లను తమకు కేటాయిస్తే ఎక్కడ నిల్వ చేయాలని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు.

అప్పుడేమైందంటే..?

రెండేళ్ల క్రితం యాసంగిలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యంలో 7,89,275 మెట్రిక్ టన్నులను విక్రయించాలని నిర్ణయించింది. మిల్లుల్లో నిల్వచేసిన వడ్లను అప్పుడే వేలం వేశారు. తక్కువ ధరకు గుత్తేదారుకు అప్పగించారనే ఆరోపణలతో ఆ వేలాన్ని రద్దుచేశారు. ఈ లోపు ఎన్నిక లొచ్చాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక ఈ సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. తొమ్మిది నెలల క్రితం తిరిగి వేలం వేశారు. ఆ వేలంలో ధాన్యాన్ని దక్కించుకున్న గుత్తేదారు 2,46,978 మెట్రిక్ టన్నులను మాత్రమే తీసుకెళ్లారు. ఇంకా 5,42,297 ఎంటీల వడ్లు ఉమ్మడి జిల్లాల్లోని మిల్లుల్లోనే ఉన్నాయి. వాటిని మూడు నెలల్లో తీసుకెళ్లాలని ప్రభుత్వం తాజాగా గుత్తేదారుకు గడువిచ్చింది. ఆ ధాన్యం బాగా చెడిపోవడంతో పరిహారంగా డబ్బు చెల్లించాలని గుత్తేదారు కోరుతున్నారు. ఒప్పుకున్న కొందరు మిల్లర్లు చెల్లించారు. చాలామంది తమకు సంబంధం లేదని, కొనుగోలు కేంద్రం నుంచి అలాగే వచ్చిందని చెబుతున్నారు. దీంతో గుత్తేదారు ఆ మిల్లుల నుంచి ధాన్యం తీసుకెళ్లడం లేదని తెలిసింది. మిల్లులో ఎక్కువ ధాన్యం ఉండటం వల్ల స్థలం సమస్య ఏర్పడుతోందని, కొత్త ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో వేలం వేసిన ధాన్యం వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)



అక్టోబరు నుంచి కొత్త ధాన్యం రాక..!

నల్గొండ జిల్లాలో అక్టోబరు మొదటి వారంలో ప్రస్తుత వానాకాలానికి సంబంధించిన కొత్త ధాన్యం వస్తుందని అధికారుల అంచనా వేశారు. సూర్యాపేట జిల్లాలో మూడో వారంలో వస్తుందని చెబుతున్నారు. ఆ లోపు మిల్లుల్లో నిల్వ చేసిన వేలం ధాన్యాన్ని ఖాళీ చేయించడం అంత సులభం కాదు. ప్రభుత్వం గుత్తేదారుకు మూడు నెలల గడువు ఇచ్చిన నేపథ్యంలో మిల్లర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించకుంటే రైతులు, ప్రభుత్వం, అధికారులు ఇబ్బంది పడాల్సి వస్తుంది.

WANTED
మార్కెటింగ్ మేనేజర్ కావలెను
సూర్యాపేట జిల్లాలో అగ్రగామి చిట్‌ఫండ్స్ భానుపురి చిట్‌ఫండ్స్ నందు పనిచేయుటకు సేల్స్‌లో అనుభవం గల వారు మార్కెటింగ్ మేనేజర్‌గా కావలెను. మంచి వేతనంతో పాటు ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. ఆసక్తి గల వారు ఫోటో కల్గిన పూర్తి బయోడేటాతో ది. 03-10-2024 లోపు ఈ క్రింది అడ్రస్‌లో సంప్రదించగలరు. ఇంటర్వ్యు తేది. 04-10-2024, సా॥ 5 గంటలకు.
భానుపురి చిట్‌ఫండ్స్, విద్యానగర్, సూర్యాపేట.
Cell: 99512 63255, 99483 83322

పదవీ విరమణ శుభాకాంక్షలు

శ్రీ & శ్రీమతి బొడ్డు సురేందర్‌రావు (సాలయ్య) - లక్ష్మి
Executive Engineer
I&CAD Irrigation Div.No.7, Nalgonda
గత 37 సంవత్సరాలుగా వివిధ హోదాలలో, విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి, నీటిపారుదల శాఖలో ఉత్తమ ఇంజనీర్‌గా ఎంపికై, అందరి మన్ననలు పొంది, కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించిన మీరు నేడు ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భంగా శుభాకాంక్షలు.
మీ భావిజీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షిస్తూ...
భార్య: లక్ష్మి
కుమారుడు - కోడలు: Er. పృథ్వీరాజ్ B.Tech - శ్రావణి M.Sc
కూతురు - అల్లుడు: Dr. పోలేపల్లి తేజస్వి MDS - Dr. ప్రవీణ్ MBBS
మనుమలు: వియాన్ ఆద్విక్, వినమ్ర, వివాన్, బంధుమిత్రులు

నమూనా ప్రకటన
బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా అందరికీ తెలియజేయునది ప్రమాణ నాకుమారుడగు శ్రీ .....కు ..... వివాహంగా శ్రీ.....వారికి చెందినటువంటి గృహము ఇంటినెం. మరియు ఖాళీ జాగా, ఈ క్రింది హద్దులు గల ఉత్తరం: ఇతరుల ఖాళీ జాగా, దక్షిణం: 20 ఫీట్ల రోడ్డు, పశ్చిమం: ఇనుప ఖాళీ జాగా, పడమట: .....గారి ఇల్లు. పట్టణంలో గల దానిని కొనవలసిన అగ్రిమెంట కుదుర్చుకున్నారు. మరియు అమ్మ మనా ఇద్దరమున్నారు. ఇట్టి విషయంగా ఎవరికైనా ఆక్షేపనలు ఉన్న ఎదల వారం రోజులలోగా సాక్ష్యములతో పనా మన్ను సంప్రదించగలరు. ఆ తరువాత వచ్చే ఎటువంటి క్లయిమ్‌లు నా క్లయింటును బైండు చేయబడవు.
సం/-
అడ్వకేట్
విజ్ఞతగల నిర్ణయం వివాదాలకు అతీతం

లక్షల విలువైన స్థిరాస్తిని కొనేముందు సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం.
'ఈనాడు'లో బహిరంగ ప్రకటన ఇవ్వడం ఎంతో సులభం.
ప్రకటనలపై 25% డిస్కౌంట్
GST 5% అదనం
వివరాలకు సంప్రదించండి:
నల్గొండ: 80080 01770, సూర్యాపేట: 96528 85838, 80081 16681
కోదాడ: 80087 09942, మిర్యాలగూడ: 91771 11894, భువనగిరి: 80080 01643

(c) eenadu

యాదాద్రి మిగులు పనులపై దృష్టి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. భక్తులకు వసతులు కల్పించడంతో పాటు భవిష్యత్తు



అవసరాలను తీర్చే కార్యాచరణతో కూడిన నివేదిక తయారు చేయాలని ఇటీవల ఆదేశించారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిలో మిగులు పనుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసేందుకు నివేదిక అందించాలని వైటీడీఏను ఆదేశించింది.

✦ ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే తీర్థజనులకు స్వయంభువులైన పంచనారసింహుల గర్భాలయంపై 45 అడుగుల ఎత్తు గల కృష్ణశిల విమానం పసిడి రూపంలో దర్శనం ఇచ్చేలా సిద్ధం కానుంది. ఇందుకు వీలైనంత త్వరగా స్వర్ణ తాపడం పనులకు తెర తీసేందుకు సీఎం సూచనలతో దేవాదాయ శాఖ సంసిద్ధమైంది. దసరా రోజు అక్టోబరు 13న ఈ క్షేత్రానికి సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి బంగారు విమానం రూపకల్పన, పనులకు శ్రీకారం చుట్టే అవకాశాలు ఉన్నాయి.

✦ ఈ ఆలయానికి ధర్మకర్తల మండలిని రెండేళ్ల కాల పరిమితి కోసం 2007లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నాటి నుంచి ధర్మకర్తల నియామకం అటకెక్కించారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఈ ఆలయానికి తితిదే లాంటి పాలకమండలి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

3 నుంచి దేవీ నవరాత్రోత్సవాలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రం లోని శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అక్టోబరు 3వ తేదీ నుంచి శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్స

యాదాద్రి క్షేత్రంలో శివాలయం

వాలు జరగనున్నాయి. ఈ వేడుకల నిర్వహణకు కొండపై గల శివాలయాన్ని తీర్చి దిద్దుతున్నారని ఈవో భాస్కర్ రావు తెలిపారు. సప్తశతి పారాయణం, లక్ష కుంకుమార్చన క్రతువులు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఆదివారం నగర శివారులోని మొగిలిచర్ల క్రికెట్ మైదానంలో వరంగల్, మెదక్ జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 49.2 ఓవర్లలో 219 పరుగులు చేసింది. జట్టులో వితేష్ 31 పరుగులు(3 వికెట్లు), రిషాంత్ 31 పరుగులు(3 వికెట్లు) తీశారు. ఛేదనకు దిగిన మెదక్ జట్టు 29.4 ఓవర్లలో 110 పరుగులకే ఆలౌట్ అయ్యింది. కోమటిపల్లి మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, నల్గొండ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్ అబ్దుల్ రఫే 71 పరుగులతో రాణించాడు. ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన నల్గొండ జట్టు 32 ఓవర్లలో 98 పరుగులకే ఆలౌట్ అయ్యింది. పూల్ 'ఏ'లో లీగ్ పోటీల్లో మహబూబ్‌నగర్ ముందంజలో ఉందని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగింటి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్ ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి మ్యాచ్‌లు: కోమటిపల్లి మైదానంలో వరంగల్ × నల్గొండ జట్లు, మొగిలిచర్లలో మహబూబ్‌నగర్ × మెదక్ జట్ల మ్యాచ్

బాల్యం.. పుస్తకానికి దూరం

నాంపల్లి, న్యూస్‌టుడే:

పుస్తకమనేది అక్షరాలతో పాటు మానవ సంబంధాలను తనలో అందంగా దాచుకున్న తరగ(తి)ని గని. పదాలతో పలకరిస్తూ.. ప్రపంచాన్ని మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. కథలు..కామిక్‌లు.. ఇలా దేనిపై చిన్నారికి ఆసక్తి ఉంటే తల్లిదండ్రులు దానికి సంబంధించి ఓ పుస్తకాన్ని వారి ముందు ఉంచండి. మనిషి తన జీవన గమనాన్ని మార్చుకోవడానికి పుస్తకానికి మించిన సాధనం మరొకటి లేదని వారికి అర్థమయ్యేలా వివరించండి. ఆధునిక సమాజంలో నేటి తరాన్ని పుస్తక పఠనానికి దగ్గర చేయండి. అదే సమాజానికి మీరిచ్చే విలువైన కానుక.

కారణాలు ఇవీ..

❖ తల్లిదండ్రులు పుస్తకాలు చదివేలా ప్రోత్సహించక పోవడం. చరవాణి, కంప్యూటర్ ఆటలు, సినిమాలు, సామాజిక మాధ్యమాలకు అలవాటు పడటం.

❖ సరైన పుస్తకాన్ని పిల్లలు ఎంపిక చేసుకోకపోవడం.చదవడంలో పిల్లలకున్న ఇబ్బందులు తల్లిదండ్రులు గుర్తించకపోవడం.

❖ ఆటలపైనే అమితాసక్తి ఉండటం. ఒక చోట నిశ్చింతగా కూర్చోలేకపోవడం.

చరవాణి, టెలివిజన్‌పై పిల్లల ఆసక్తి..

నేటి చిన్నారులు టీవీలు, చరవాణులకు అతుక్కుపోయి కామిక్ కథలు, హింసను ప్రేరేపించే దృశ్యాలను ఎక్కువగా చూస్తున్నారు. పలు ఆంగ్ల చిత్రాల సన్నివేశాలకూ ప్రభావితమైన వారున్నారు. అదే పనిగా చరవాణికి అతుక్కుపోయి పుస్తకం పట్టని వారే ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి అలవాట్లు ఉన్న చిన్నారుల గుండె వేగం గణనీయంగా పెరిగిందని ఇటీవల ఓ సర్వేలో వెల్లడైంది. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలను ఆసక్తి ఉన్న పుస్తకాల పఠనం వైపు మళ్లించాల్సిన ఆవశ్యకతను తల్లిదండ్రులు గుర్తించాలి.

ఉమ్మడి జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో 100 మంది పిల్లలతో 'న్యూస్‌టుడే' బృందం మాట్లాడగా ఇలా..

పాఠ్యాంశాలు కాకుండా వేరే పుస్తకాలు చదివే అలవాటు ఉందా?



అలవాటు లేదు
చదువుతాం

జేబు ఖర్చులు దేని కోసం వినియోగిస్తారు?

ఆహార పదార్థాలు, ఇతర ఖర్చులకు
నచ్చిన పుస్తకాలు కొంటాం

వినోదం, కాలక్షేపం కోసం ఏం చేస్తుంటారు?

చరవాణి వినియోగం
ఆటలు
పుస్తక పఠనం

బహుమతిగా ఇవ్వాలి..

పిల్లలకు చిన్ననాటి నుంచే పుస్తక పఠనం అలవాటు చేయాలి. ఏదైనా సందర్భం వస్తే పుస్తకాలు బహుమతిగా ఇచ్చి పఠనంపై దృష్టి మరల్చేలా చూడాలి. చందమామా, బాలమిత్ర, బొమ్మరిల్లు లాంటి కథల పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. వాటిలోని నీతిని వారికి వివరించాలి. అప్పుడప్పుడు గ్రంథాలయాలకు తీసుకెళ్లి పాఠకుల ఆసక్తిని గమనింపజేయాలి. మంచి పుస్తకాల గురించి పిల్లలతో విస్తృతంగా చర్చించాలి. ఇంటి ప్రధాన హాల్లో, పిల్లల గదిలో పుస్తకాలు ఉండేలా చూడాలి. పుట్టిన రోజు నాడు ఓ మంచి పుస్తకం ఇవ్వాలి. ఇంటిలో ఓ చిన్న పాటి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి.

పుస్తక పఠనంతో లాభాలు

బోయపల్లి రాంశెట్టి, విశ్రాంత ప్రధానాచార్యులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాంపల్లి

పుస్తక పఠనంతో విద్యార్థులతో పాటు పెద్దలకు చాలా లాభాలున్నాయి. ఉన్నత వ్యక్తిత్వంతో పాటు సానుకూల దృక్పథం అలవడుతుంది. స్వయం ప్రేరణ, క్రమశిక్షణ, సామాజిక నైపుణ్యాలు మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి. సందర్భమేదైనా పిల్లలకు మంచి పుస్తకాలు బహుమతిగా ఇవ్వడం వారి భవిష్యత్తుకు బాటలు వేయడంలో భాగమనే విషయం మరువొద్దు.

పట్టుదలతో..ఓ ప్రణాళికతో..

టాస్క్ శిక్షణ సద్వినియోగం చేసుకుంటున్న డిగ్రీ విద్యార్థులు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: కలల కొలువు సాధించాలని యువత భావిస్తుంటే.. దానికి తగ్గట్టు నైపుణ్యాలు ఉండాల్సిందేనని కంపెనీల యాజమాన్యాలు ఆకాంక్షిస్తున్నాయి. ఈ రోజుల్లో చదువు పూర్తవగానే ఉద్యోగం రావడం అంత సులువేం కాదు. అందుకు ప్రతి విద్యార్థికి ఉద్యోగ నైపుణ్యాలు అవసరం. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నైపుణ్యాల పెంపుదలే లక్ష్యంగా ప్రభుత్వం ఐటీశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ను ఏర్పాటు చేసింది.

టాస్క్ శిక్షణలో డిగ్రీ విద్యార్థులు

✦ టాస్క్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు నైపుణ్యాల శిక్షణను ఇస్తున్నారు. ప్రధానంగా విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్ల భాష పరిజ్ఞానం, భావవ్యక్తీకరణ సామర్థ్యాలు, ఇంటర్వ్యూలను ఎదుర్కొనేలా మనోధైర్యం, వ్యక్తిగత సామర్థ్యాలు, బృందాన్ని నడిపించగల నైపుణ్యం, సాంకేతిక, విజ్ఞాన అంశాలను నేర్పిస్తున్నారు.

✦ ఇటీవల నల్గొండ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్‌లో టాస్క్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు డిగ్రీ విద్యార్థులకు ఆయా అంశాల్లో తర్ఫీదు ఇచ్చారు. ఇందులో ఆయా కళాశాలలకు చెందిన విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. ఉద్యోగాల సాధన కోసం టాస్క్ శిక్షణ పొందుతున్న జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల విద్యార్థులను 'న్యూస్‌టుడే' పలకరించింది.

ఉద్యోగ సాధనకు శిక్షణ

– అఖిల, కాకతీయ డిగ్రీ కళాశాల, నల్గొండ

బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్నా. ఉద్యోగ మేళాలో సత్తా చాటాలనే లక్ష్యంతో ప్రస్తుతం టాస్క్ శిక్షణ తీసుకుంటున్నా. కళాశాలలో ఎప్పటికప్పుడు నిర్వహించే టాస్క్ శిక్షణ తరగతుల ద్వారా వ్యక్తిత్వ వికాసం, ఆంగ్ల భాషపై పట్టు, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై పట్టు పెంచుకున్నా.

చదువుతున్న కళాశాలలోనే..

– పూజిత, నీలగిరి డిగ్రీ కళాశాల, నల్గొండ

బీజడ్‌సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. డిగ్రీలో చేరగానే ఆన్‌లైన్‌లో టాస్క్ సభ్యత్వం తీసుకున్నా. తద్వారా విద్యా సంవత్సరం ముగిసే వరకు శిక్షణ తీసుకునే అవకాశం లభించింది. చదువుకునే చోటే భవితను మార్చే శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా భావ వ్యక్తీకరణ సామర్థ్యాలు, ఇంటర్వ్యూలను సమర్థంగా ఎదుర్కోవడం, సమస్య- పరిష్కార నైపుణ్యాలు, క్యాంపస్ టు కార్పొరేట్ స్కిల్స్‌పై పట్టు సాధించాను.

ఆంగ్ల భాషపై పట్టు

– నిఖిత, బీకాం తృతీయ సంవత్సరం

టాస్క్ శిక్షణ ద్వారా ఆంగ్ల భాషపై పట్టు సాధించాను. ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి, బృంద చర్చలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పట్టు సాధించా. టాస్క్ ఆధ్వర్యంలో నల్గొండ ఐటీ టవర్‌లో ఎప్పటికప్పుడు నిర్వహించే శిక్షణలో పాల్గొంటున్నాం. కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులు మాలో ఉద్యోగాలు సాధించగలమనే ధైర్యాన్ని నింపుతున్నాయి.

రాజస్థాన్ పల్లెటూరులా వేసిన సెట్

దండుమల్కాపురంలో.. రాజస్థాన్ సెట్

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: ఎడారి ప్రాంతం.. రాజస్థాన్‌లోని పల్లెటూరును తలపించేలా వేసిన సినిమా సెట్ ఆకట్టుకుంటోంది. ఇది యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని పారిశ్రామిక పార్కు పక్కనే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆనుకొని వేశారు. అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ సినిమా చిత్రీకరణ కోసం ఇరవై రోజుల క్రితమే ఏర్పాటు చేయగా.. ఐదు రోజుల పాటు సినిమా చిత్రీకరించారు. హీరోగా బాలకృష్ణ, హీరోయిన్‌గా ప్రగ్యా జైస్వాల్ నటిస్తుండగా.. కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే హీరో, హీరోయిన్‌లపై పలు కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. అక్టోబరు మొదటి వారంలో షూటింగ్ పునఃప్రారంభం కానుంది.

సరకులను విక్రయించే కొట్టు

నటుల కోసం వేసిన గృహాలు..

పేద ఖైదీల జామీనుకు వెసులుబాటు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో క్షణికావేశంలో చిన్నపాటి తప్పులు చేసి జైలు పాలై విడుదల కోసం అనుమతి వచ్చినా ఆర్థిక స్థోమత లేక జామీను ఇచ్చే వారు లేక జైళ్లలో మగ్గుతున్న పేద ఖైదీలకు సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల ప్రత్యేక వెసులు బాటు కల్పించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సర్వోన్నత న్యాయస్థానం తీసుకొచ్చిన జీవోను జిల్లాలో ప్రత్యేక సమావేశం ద్వారా అమలు చేస్తున్నారు. జైళ్ల శాఖ జిల్లా స్థాయి సాధికార కమిటీలో కలెక్టర్ ఛైర్మన్‌గా, జిల్లా జైలు సూపరింటెండెంట్ కన్వీనర్, జిల్లా ప్రొహిబిషన్ అధికారి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ఒక న్యాయమూర్తితో పాటు ఎస్పీ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ గత నెల 18 నుంచి జిల్లాలో అమల్లోకి వచ్చింది. ఈ పథకం మార్గదర్శకాల్లో అవినీతి నిరోధక చట్టం, మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద నిర్దిష్ట నేరాలకు పాల్పడిన వ్యక్తులతో పాటు జాతీయ భద్రత, వరకట్న వేధింపులు, అత్యాచారాలు, హత్యలు, మానవ అక్రమ రవాణా, పోక్సో, మాదక ద్రవ్యాలు వంటి క్రూరమైన నేరాలకు పాల్పడే వ్యక్తులకు ఈ పథకం వర్తించదు. నల్గొండ జిల్లా జైలుతో పాటు దేవరకొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, భువనగిరి సబ్ జైళ్లలో ప్రస్తుతం 270 మంది వరకు ఖైదీలు ఉన్నారు. వారిలో చిన్న చిన్న నేరాలు (పెట్టీ కేసులు) చేసి జైలుకు వెళ్లి జామీను తీసుకోవడానికి ఆర్థిక స్థోమత లేనివారు ప్రస్తుతం పది మంది లోపు ఉన్నట్లు తెలుస్తోంది. వీరికి ఆయా జిల్లాల కమిటీ ద్వారా జామీను ఇప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

స్వర్ణగిరికి అనతికాలంలోనే ప్రాచుర్యం

భువనగిరి, న్యూస్‌టుడే: స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అనతికాలంలోనే దేశంలోనే ప్రసిద్ధి క్షేత్రంగా పేరు ప్రఖ్యాతలు గడించిందని హాస్యబ్రహ్మ, సీనియర్ జర్నలిస్టు శంకరనారాయణ అన్నారు. శ్రీ రాగ రమ్య సాంస్కృతిక, సామాజిక సంస్థ ఆధ్వర్యంలో స్వర్ణగిరి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన సంగీత నృత్య నీరాజనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మికతను చాటడంతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు స్వర్ణగిరి క్షేత్రం వేదికగా నిలిచిందన్నారు. శ్రీ రాగ రమ్య సాంస్కృతిక, సామాజిక సంస్థ పలు పర్యాయాలు కనువిందు చేసే కార్యక్రమాలు నిర్వహించినందుకు నిర్వాహకులు రమ్యను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రాజెక్టు డైరెక్టర్ పతంజలి, శ్రీ రాగ రమ్య సాంస్కృతిక, సామాజిక సంస్థ నిర్వాహకురాలు రమ్య పాల్గొన్నారు. కళా గురువులు కృష్ణప్రియ కళ్యాణి, ప్రశాంతి, జయలక్ష్మి, విశాల్, మాధురి, యోగేశ్ శిష్య బృందాలు నృత్య ప్రదర్శనలు ఇచ్చాయి.

స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ రాగ రమ్య సాంస్కృతిక, సామాజిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతికోత్సవంలో మాట్లాడుతున్న హాస్యావధాని శంకరనారాయణ

ఆటో, కారు ఢీ.. వృద్ధురాలి మృతి

నిడమనూరు, న్యూస్‌టుడే: వేగంగా వచ్చిన ఓ గుర్తుతెలియని కారు.. ఆటోను ఢీకొట్టడంతో ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలై మృతిచెందిన ఘటన నిడమనూరు మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారమ్మగూడేనికి చెందిన **గడ్డం సుబ్బమ్మ(60)** పని నిమిత్తం మిర్యాలగూడ వెళ్లి తిరిగి ఆటోలో ఇంటికి వస్తోంది. ఆటో మరో అర్ధగంటైతే గ్రామానికి చేరుకునే అవకాశం ఉండేది. ఆటో ముదిమాణిక్యం కాలువ వద్ద ఉన్న మూలమలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగంలో కూర్చున్న సుబ్బమ్మకు కాలు రెండు చోట్ల విరగటంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన ఆమె కుటుంబసభ్యులు మిర్యాలగూడ ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నార్కెట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో చనిపోయినట్లు ఆమె బంధువులు తెలిపారు.

స్వాతంత్ర్య పోరాట యోధుడు రాధాకృష్ణ కన్నుమూత

చిట్యాల, న్యూస్‌టుడే: తాళ్లవెల్లంల గ్రామానికి చెందిన స్వాతంత్ర్య పోరాట యోధుడు కొండవీటి రాధాకృష్ణ(92) ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. అనారోగ్యంతో వారం రోజుల క్రితం ఆసుపత్రిలో చేరిన ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. కొన్నేళ్ల క్రితం రాధాకృష్ణ కుటుంబంతో వెళ్లి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తన 14వ ఏటనే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రజాకార్లకు వ్యతిరేకంగా తుపాకీ పట్టి ఉద్యమించారు. ఎంఏ, ఎంఈడీ, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి, ఉపాధ్యాయుడిగా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి, డీఈవో స్థాయికి వెళ్లారు. ఆయనకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామంలో యువత కోసం 'నవ యుగ చైతన్య గ్రంథాలయం' ఏర్పాటు కోసం రూ.లక్ష పైచిలుకు వెచ్చించారు. అమెరికా నుంచి పెద్ద కుమారుడు, మనవళ్లు, మనవరాళ్లు, కుటుంబ సభ్యులు రావాల్సి ఉన్నందున అంత్యక్రియలు సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

కొండవీటి రాధాకృష్ణ

బాలుడు, బాబాయ్‌ని బలిగొన్న అతివేగం

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: ఆ బాలుడికి బాబాయ్ అంటే చాలా ప్రేమ. బాబాయ్‌కి కూడా అంతే అభిమానం. ఇద్దరూ కలిసి బంధువుల ఇంటికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో బాబాయ్, అబ్బాయ్‌లు ఇద్దరూ మృతిచెందిన దుర్ఘటన ఆదివారం నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చెన్నారం గేట్ మలుపు వద్ద చోటుచేసుకుంది. ఎస్సై రాంమూర్తి, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే జిల్లాకు చెందిన నేరెడుగొమ్ము మండలం బుగ్గతండాకు చెందిన లోటావత్ భీముడు(23), అతని అన్న కుమారుడు వెంకటేష్(8) కలిసి ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై నాంపల్లి మండలం రేఖ్యతండాలో గల బంధువుల ఇంటికి వెళ్తున్నారు. హైదరాబాద్-సాగర్ రాష్ట్ర రహదారిలో మండలంలో చెన్నారం గేట్ మలుపు వద్ద రాజధాని నుంచి ఐదుగురు విద్యార్థులు కారులో చీరాలకు వెళ్తూ అతివేగంతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ భీముడిని దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. మృతదేహాలను మరణోత్తర పరీక్షల నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

లోటావత్ భీముడు

లోటావత్ వెంకటేష్

మద్యం మత్తే ప్రమాదానికి కారణం

ఆదివారం సెలవు కావడంతో బీటెక్ చదువుతున్న ఐదుగురు యువకులు ఉత్సాహంగా గడిపేందుకు చీరాల బీచ్‌కు వెళ్తున్నామని విచారణలో తెలిపినట్లు ఎస్సై పేర్కొన్నారు. వారిలో ముగ్గురు మద్యం మత్తులో ఉండటమే కాకుండా వేగంగా నడపడం, మలుపు కావడంతో కారు పూర్తిగా అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు, అందులో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని.. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సెలవు లేకుంటే బతికేవారు

భీముడు చేపల వేటతో పాటు మెకానిక్‌గా పని చేస్తుండగా, బాలుడు వెంకటేష్ రెండో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇద్దరూ కలిసి బంధువుల ఇంటికి బయలుదేరారు. సెలవు లేకుంటే వెళ్లే వారు కారని మృతుల తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది.

ఐస్.. మల్లన్న..!

చౌటుప్పల్‌లో ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్న బాతరాజు మల్లేశ్ అలియాస్ మల్లన్న

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఈయన.. 1998లో రెండు చక్రాల బండిని తోసుకుంటూ గల్లిగల్లీకి తిరిగి ఐస్‌క్రీమ్‌లు అమ్మడం ప్రారంభించాడు. 2007లో మూడు చక్రాల బండిగా మార్చి ఊళ్లలో తిరిగి అమ్మేవాడు. 2024లో ఆటోను ఐస్‌క్రీమ్ దుకాణంగా మార్చి ఆరు మండలాల్లో రోజుకు 12 నుంచి 16 గంటలు తిరుగుతూ వ్యాపారం చేస్తున్నాడు. కాలమేదైనా 26 ఏళ్లలో ఒక్క రోజైనా ఇంట్లో విశ్రాంతి తీసుకుంది లేదు. ఇన్నేళ్లలో జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడింది లేదు. సినీనటుడు నందమూరి బాలకృష్ణకు వీరాభిమాని. సినిమా విడుదలైందంటే ఐస్‌క్రీమ్ బండితో సహా వెళ్తుంటాడు. పనినే దైవంగా.. మల్లన్నస్వామికి భక్తుడిగా.. ఎప్పుడు భుజంపై ఆ దేవుడి గుర్తుగా పసుపు రంగు కండువా ధరించే ఈయన పేరు.. బాతరాజు మల్లేశ్ అలియాస్ ఐస్‌క్రీమ్ మల్లన్న.

మల్లన్న జీవన ప్రస్థానం ఆయన మాటల్లోనే..

మాది సుంకెనపల్లి గ్రామం. 1974లో జన్మించా. మా ఊళ్లో అయిదో తరగతి వరకు చదివా. రోజూ మూడు కిలోమీటర్లు కాలినడకన గుండ్రాంపల్లికి వెళ్లి ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించా. పదిలో ఉత్తీర్ణుడ్ని కాకపోవడంతో చదువు ఆగిపోయింది. 1991లో హైదరాబాద్‌కు వెళ్లి సుల్తాన్‌బజార్, ఆబిడ్స్, మలక్‌పేటల్లోని మిఠాయి దుకాణాల్లో, కేఫ్‌లలో పని చేశా. అప్పుడే సినీనటుడు నందమూరి బాలకృష్ణపై అభిమానం ఏర్పడింది. ఆయన సినిమా విడుదలైందంటే ఆర్టిసీ చౌరస్తాలోని టాకీస్‌ల ఎదుట భారీ కటౌట్లు కట్టేవాడ్ని.

కరోనా రావడంతో ప్రజలు ఐస్‌క్రీమ్‌లు, తినుబండారాలను తినడం తగ్గింది. దీంతో పేరున్న కంపెనీ ఐస్‌క్రీమ్‌లు మాత్రమే అమ్మేందుకు నిర్ణయించుకుని వాయిదా పద్ధతిలో నెలకు రూ.12 వేలు చెల్లించేలా 9 నెలల క్రితం రూ.3.40లక్షలతో ఆటో కొన్నా. రూ.లక్షతో ప్రత్యేకంగా వాహనాన్ని తయారు చేయించా. రూ.1.20 లక్షలతో ఫ్రిజ్ ఏర్పాటు చేయించా. దీనిపై చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, మునుగోడు, భూదాన్ పోచంపల్లి, వలిగొండ, నార్కట్‌పల్లి మండలాల్లో ఎక్కడ జాతరలు, పండగలు, విందులున్నా అక్కడికెళ్లి ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నా. మధ్యాహ్నం నుంచి రాత్రి ఒంటి గంట వరకు పంతంగి టోల్‌ప్లాజా వద్ద బండి ఉంటుంది. కార్లలో, ట్రావెల్స్ బస్సుల్లో వెళ్లేవాళ్లు నా వద్ద ఐస్‌క్రీమ్‌లు కొంటుంటారు. పిల్లలకు, వృద్ధులకు ఉచితంగా ఇస్తుంటా.

పెట్టేవాడ్ని.

✤ 24 ఏళ్ల వయసులో చిన్నకొండూరుకు చెందిన మేనమామ బిడ్డ భాగ్యమ్మతో పెళ్లయింది. హైదరాబాద్‌కు వెళ్లడం మానుకుని రూ.5వేలు పెట్టుబడితో చౌటుప్పల్‌లో పర్వతం యాదగిరి వద్ద రెండుచక్రాల బండి తీసుకుని ఎండాకాలంలో పాలు, సేమ్యా ఐస్‌క్రీమ్ అమ్మేవాడిని. వానాకాలం, చలికాలాల్లో క్రీమ్ తయారు చేసి బుర్రల్లో పెట్టి ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు అమ్మి ఇంటికెళ్లేవాడ్ని. తర్వాత మూడుచక్రాల బండి తెచ్చా. దాన్ని తొక్కుకుంటూ 2018వరకు నల్గొండ క్లాసిక్ కంపెనీ నుంచి తెచ్చిన చాకోబార్, కప్పు, కుల్ఫీ, కోన్‌లు రాత్రి వరకు అమ్మేవాడ్ని.

EENADU eClassifieds

BUSINESS SERVICES

కన్సల్టెన్సీ కాదు VIP ఐబ్రో, పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవాడు, RMP & డాక్టర్స్ కావలెను. ఱీ

కోదాడ

• కోదాడ • హుజూర్‌నగర్

అన్నదాన సత్ర కమిటీ సమావేశం

మఠంపల్లి, న్యూస్‌టుడే: మట్టపల్లి క్షేత్రంలోని రెడ్డి నిత్యాన్నదాన సత్రకమిటీ సమావేశం ఆదివారం జరిగింది. దాతల విరాళాలతో ఇక్కడ నిర్మిస్తున్న వేదుకల మందిరం పనులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధుల సమీకరణ కోసం నిర్వహించిన ఈ సమావేశానికి కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వరెడ్డి అధ్యక్షత వహించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన కార్యవర్గ సభ్యులు హాజరైన సమావేశంలో సత్రానికి వచ్చే యాత్రికులకు అన్ని సదుపాయాలు కల్పించాలని, విరాళాల రూపంలో నిధులు సమీకరించాలని సభ్యులు తీర్మానించారు. విశ్రాంత ఉప తహసీల్దార్ లక్ష్మి రూ.60వేలు, శ్రీనివాసరెడ్డి రూ.10,016సత్ర అభివృద్ధి కోసం అందజేశారని ఛైర్మన్ చెప్పారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని విజయదుర్గ ఆలయం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. అక్టోబరు 3 నుంచి 12వ తేదీ విజయదశమి వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ కొణతం ఆదిరెడ్డి తెలిపారు. ఇంద్రకీలాద్రి తరహాలో అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
80085 50363
96030 18889

మఠంపల్లి, న్యూస్‌టుడే

? నిత్యం జన సంచారం ఉండే చౌటపల్లి-మఠంపల్లి డొంక దారిలో ఎత్తు తక్కువలో ఏర్పాటు చేసిన నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. – **నాగరాజు, మఠంపల్లి**

✔ దాన్ని గతంలో ఎప్పుడో ఏర్పాటు చేశారు. దిమ్మె ఎత్తును పెంచేలా చర్యలు తీసుకుంటాం. – **హరీష్‌రెడ్డి, ఏఈ**

కుప్పకూలిన ఇంటి పైకప్పు

హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణంలో ఓ ఇంటి పైకప్పు కుప్పకూలిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. 15వ వార్డులోని వెంకటేశ్వర్లు ఇంటిని అద్దెకిచ్చారు. ఇటీవల భారీ వర్షాలకు పైకప్పు నానిపోయింది. ఈ క్రమంలో ఒక్కసారిగా స్లాబు పడిపోయింది. మంచం, టీవీ, ల్యాప్‌టాప్, ఫోన్లు, ఫ్రిజ్జి, కూలర్ తదితర సామగ్రి దెబ్బతిన్నాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని బాధితుడు తెలిపారు. వార్డు కౌన్సిలరు నరసింహారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బస్టాండ్ ఆవరణలో దుర్గంధం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కోదాడ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఇటీవల కురిసిన వర్షానికి కొట్టుక వచ్చిన చెత్త చెదారంతోపాటు పిచ్చి చెట్ల మధ్యలో మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ సీఐ నాగశ్రీని వివరణ కోరగా త్వరలోనే మురుగునీటిని తొలగిస్తామన్నారు.

దాతల ఉదారత.. చేరువైన విద్య

నడిగూడెంలోని కొల్లు లక్ష్మీనర్సమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాల

నడిగూడెం, కోదాడ, న్యూస్‌టుడే: మండల పరిధిలో ఉన్నత విద్య అందుబాటులో లేక ఎంతో మంది పేద విద్యార్థులు పదో తరగతితో చదువు ఆపేసేవారు. దూర ప్రాంతాలకు వెళ్లలేక, ప్రైవేటులో చదివించే స్థోమత లేక తల్లిదండ్రులు మధ్యలోనే చదువు మాన్పించేవారు. మునగాల మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన కొల్లు కోటయ్య దాతృత్వంతో నడిగూడెం మండల కేంద్రంలో 1987లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. దాత తల్లి పేరు మీద కొల్లు లక్ష్మీనర్సమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాలగా కొనసాగుతూ నాటి నుంచి నేటి వరకు ఎందరో పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చింది. మునగాల, నడిగూడెం మండలాల పరిధిలోని 30 గ్రామాల విద్యార్థులకు ఇది ఒక్కటే ప్రభుత్వ జూనియర్ కళాశాల. నేటికీ కళాశాలలో విద్యార్థుల అవసరాలు తీర్చేందుకు దాత వారసుడు డా.కొల్లు శ్రీనివాసరావు తన వంతు సహాయం అందజేస్తున్నారు. ఇటీవల నూతనంగా మంజూరైన ఎం.ఎల్.టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ వృత్తి విద్యా కోర్సులకు అవసరమైన ప్రయోగశాల సామగ్రిని రూ.2 లక్షల వ్యయంతో కొనుగోలు చేసి కళాశాలకు అందజేశారు. గతేడాది కళాశాలలో అదనపు గది నిర్మాణానికి రూ.1.30 లక్షలు అందజేసి దాతృత్వం చాటుకున్నారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉండాలని..!

మఠంపల్లి, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులలో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నది ఆ యువ ఉపాధ్యాయుడి సంకల్పం. గత రెండు దశాబ్దాలుగా ఎక్కడ పనిచేస్తున్నా అందుకు అనుగుణంగా చిన్నారులకు టై, బెల్టులతో పాటు బూట్లు, బ్యాగులను దాతల సహకారంతో సమకూర్చడం, సొంత ఖర్చులతో రాత పుస్తకాలు, పెన్నులు అందజేయడం తనకు ఉపాధ్యాయ వృత్తిలో భాగమయ్యాయని చెబుతున్న మార్కపుడి సుధాకర్ స్వస్థలం మఠంపల్లి మండలం పెదవీడు. ప్రస్తుతం ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. నవోదయ, గురుకుల విద్యాలయాల్లో సీట్లు సాధించేలా ఉచితంగా కోచింగ్ ఇస్తూ తాను పనిచేసే పాఠశాలల్లో సేవా సంస్థలు, దాతల సహకారంతో ప్రైవేటు విద్యాలయాలకు ఉండే అన్ని హంగులను సమకూరుస్తున్నారు. ప్రధానంగా చిన్నారులు కూర్చునేందుకు బెంచీలు, ప్రార్థనా సమయంలో ఉపయోగించేందుకు మైకులు, కనీస వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు. గత ఇరవయ్యేళ్లుగా సేవా నిరతిని కొనసాగిస్తున్నారు. బదిలీపై వెళ్తే ప్రతిసారీ గ్రామస్థుల సన్మానాలు అందుకోవడం సుధాకర్ ప్రత్యేకత.

బదిలీపై వెళ్తున్న సుధాకర్ దంపతులను సన్మానిస్తున్న కిష్టాపురం గ్రామస్థులు (పాత చిత్రం)

పనులు నిలిపి వేయాలంటూ ఆందోళన

మోతె: రావిపహాడ్ గ్రామ పరిధిలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ పనులు నిలిపివేయాలంటూ గ్రామస్థులు కొందరు ఆదివారం ఆందోళన నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు ఫ్యాక్టరీ గేటు ముందు నిరసన తెలిపారు. పరిశ్రమ నిర్మాణం పూర్తయితే పంటపొలాలు కాలుష్యానికి గురవుతాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. సుధాకర్‌రెడ్డి, శ్రీను, జాన్‌రెడ్డి, కృష్ణ, పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీస్

యస్.టి.ఆర్.జిల్లా నందిగామ మండలం, నందిగామ పట్టణ కామరసుడు అచ్చి శేషగిరి, తండ్రి (లేటు) కొండలరావు వారి వలస సంజాయిషీ పొందిఇచ్చిన పబ్లిక్ నోటీస్.

మా క్లయింట్ ది 06-08-2023వ తేదిన రు దిగువ నోటీస్ షెడ్యూలు దాఖలా ఆస్తిని, నందిగామ పట్టణ వాస్తవ్యులు శ్రీమతి అంబడిపూడి జానకిదేవి, భర్త లేటు అంబడిపూడి రాధాకృష్ణమూర్తి వారి వద్ద బిట్ మక్కాగా రూ. 85,00,000-00లకు కొనుగోలు చేసి అదే రోజున రూ.80,00,000-00లు అంబడిపూడి జానకిదేవిగారికి ఇచ్చి అగ్రిమెంట్ ఆఫ్ సేల్ వ్రాయించుకున్నారనియు, శేషించిన క్రయధనము రూ.5,00,000-00లు ది.06-09-2023లోపు చెల్లించే ఏర్పాటు. శ్రీమతి అంబడిపూడి జానకిదేవి గారు శేషించిన క్రయధనము తీసుకోకుండా, కాలయాపన చేయుచు మా క్లయింటు ఎన్ని మార్లు శేషించిన క్రయధనము తీసుకుని నోటీస్ షెడ్యూలు దాఖలా ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయమని అడిగిననూ శ్రీమతి అంబడిపూడి జానకిదేవిగారు సరైలయిన సమాధానము చెప్పకుండా నోటీస్ షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబందించి ఒరిజినల్ దస్తావేజులు లేవని ఆబద్ధపు సంగతులు చెప్పుచూ కాలయాపన చేయుచు, సదరు ఆస్తిని ఇతరులకు అమ్మజూపుతున్నారని మా క్లయింటుకు తెలియవచ్చినదనియు కనుక యావన్మందికి ఈ పబ్లిక్ నోటీస్ ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ దిగువ నోటీస్ షెడ్యూలు దాఖలా ఆస్తి మీద ఎటువంటి క్రయ విక్రయాలు జరిగిన యెడల అవి మా క్లయింటుకు బైండ్ చేయవని, ఆటువంటి క్రయ విక్రయాలు చెల్లనేరవని ఇందుమూలముగా తెలియజేయడమైనది. మరియు మా క్లయింటు తీసుకునే సివిల్ క్రిమినల్ చర్యలకు మీరే బాధ్యులగుదురని ఈ పబ్లిక్ నోటీస్ ద్వారా తెలియజేయటమైనది.

NOTICE SCHEDULE

An Extent of 344 Square yards of site consisting of ground. First and Second Floors RCC Building in R.S. No 522/4 Situated in Nandigama Nagar Panchayat, Nandigama Madal, Nandigama Sub Registry, NTR District, being **Bounded by: East :** Property of Mittapalli Venkata Seetha Ramarao, **South:** Property of Velpula Gnana Prasanna Rao, **West :** Road, **North:** Road

NOTE: మా క్లయింట్ నోటీస్ షెడ్యూలు దాఖలా ఆస్తి గురించి శ్రీమతి అంబడిపూడి జానకిదేవిగారికి ది. 26-9-2021న లీగల్ నోటీస్ ఇవ్వటం జరిగినది.

నందిగామ,
ది. 28-09-2024

ఇట్లు
SHAIK SYDA B.Com., LLB
ADVOCATE
Court Road, Nandigama -521 185.
Ph: 98493 83906

సమస్యల పరిష్కారంలో పీడీఎస్‌యూ ముందంజ

వాలీబాల్ క్రీడాకారులతో పీడీఎస్‌యూ నాయకులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థి రాష్ట్ర నాయకుడు రాయపూడి వెంకటేశ్వరరావు(చిన్ని) అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వాలీబాల్ పోటీలను పూర్వ విద్యార్థులు వెంకటేశ్వర్లు, పాండురంగారావు, నాగిరెడ్డి, సీతయ్యలతో కలిసి ప్రారంభించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ముందంజలో ఉందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాంరాజగోపాల్, ఆర్యవైశ్య నాయకులు

సామాజిక సేవలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. కోదాడ అవోపా(ఆర్యవైశ్య అఫిషియల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సేవా కార్యక్రమాలను అభినందించారు. అవోపా అధ్యక్షుడు ఇమ్మడి రమేశ్ మాట్లాడారు. నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు శిల్ప, ఉపాధ్యక్షుడు చెన్నకేశవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, లోకేష్, రాంమూర్తి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఈ పచ్చదనం.. అనారోగ్య కారకం..!

పట్టణంలో వారం రోజులుగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు ముమ్మరంగా నడుస్తున్నాయి. పలు ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు జరిగాయి. కానీ జీవీపీ లాజ్జి వెనుక బజారులో పచ్చని నాచుతో కప్పబడిన బురద గుంట దోమలకు నిలయంగా మారింది. అసలే జ్వరాలతో సతమతమవుతున్న జనానికి ఇవి ప్రాణసంకటంలాంటిదే. నాలుగో వార్డులో ఉన్న పచ్చని కుంటలా కన్పిస్తున్న ఈ మురుగు నీరు దోమలకు నిలయంగా మారకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని పుర అధికారులు చెబుతున్నారు. – **హుజూర్‌నగర్, న్యూస్‌టుడే**



స్తంభాన్ని పట్టించుకోరూ..!

మండల కేంద్రంలోని రాళ్లబావి సమీపంలో ఉన్న వీధిలో విద్యుత్తు స్తంభం పూర్తిగా సీసీ రహదారి వైపు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. వీధిలో నిత్యం బాటసారులు వెళ్తుంటారు. సాయంత్రం వేళలో చిన్నారులు సమీపంలో ఆడుకుంటారు. దాన్ని తొలగించి ఆ స్థానంలో నూతనంగా స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. విద్యుత్తు శాఖ ఏఈ వికాస్ వివరణ కోరగా సిబ్బందిని పంపించి స్తంభాన్ని వెంటనే మార్చిస్తామన్నారు.

– **మునగాల, న్యూస్‌టుడే:**

ప్రమాదానికి కారకాలు.. ఈ వాహనాలు

మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలో సర్వీస్ రహదారి, జాతీయ రహదారిపై నిత్యం లారీలు, ఇతర వాహనాలు నిలుపుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఎస్సై ప్రవీన్‌కుమార్ వివరణ ఇస్తూ.. జాతీయ రహదారి, సర్వీస్ రహదారిపై వాహనాలను నిలుపరాదని, నిబంధనలకు విరుద్ధంగా నిలిపితే ఛలాన విధించడమే గాక చర్యలు తీసుకుంటామన్నారు. – **మునగాల, న్యూస్‌టుడే**

అడుగుకో గుంత.. ప్రయాణమంతా చింత

సీతారాంపురం నుంచి నారాయణపురం వరకు సుమారు 4 కి.మీ. ఉంటుంది. ఈ దారిలో ప్రయాణించాలంటే అడుగుకో గుంతతో నరకయాతనే. దారి మొత్తం గుంతలమయంగా మారడంతో ప్రయాణం ఇబ్బందిగా మారింది. ఈ మార్గానికి గతంలో రూ.43 లక్షలతో మరమ్మతులకు సంబంధించి నిధులు మంజూరయ్యాయి. టెండర్ సమయం గడిచిపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లాయి. మళ్లీ నూతన ప్రతిపాదనలు పంపించారు. కానీ నేటికీ ఉత్తర్వులు రాలేదని అధికారులు చెబుతున్నారు. పీఆర్ ఏఈ లక్ష్మారెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

– **చిలుకూరు, న్యూస్‌టుడే:**

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

గత 39 సం॥లుగా విద్యుత్ శాఖలో వివిధ హోదాలలో పనిచేస్తూ ప్రజలకు అత్యుత్తమమైన సేవలందించి అందరి ఆదరాభిమానాలు పొంది నేడు ది.30-9-2024న Sr.1st గ్రేడ్ ఫోర్‌మెన్ (SGP)గా ఉద్యోగ విరమణ చేయుచున్న

శ్రీ నండ్రు రవికుమార్

గారికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలతో..

శ్రీ నండ్రు రవికుమార్ గారు
సీనియర్ 1st గ్రేడ్ ఫోర్‌మెన్ (SGP)
TGSPDCL కోదాడ

బంధుమిత్రులు మరియు శ్రేయోభిలాషులు

కోదాడ, హుజూర్‌నగర్, మునగాల విద్యుత్ శాఖ అధికారులు మరియు సిబ్బంది

సూర్యాపేట (జిల్లా) సర్కిల్ విద్యుత్ అధికారులు మరియు సిబ్బంది

సంక్షిప్త సమాచారం

నివాళి అర్పించి.. ఉపాధ్యాయులను సన్మానించి.. హుజూర్‌నగర్: గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని హుజూర్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులను సన్మానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు శివారెడ్డి, శ్రావణ్‌కుమార్, రామారావు, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

వైద్య శిబిరం.. మునగాల: సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు.

రక్తదానం.. కోదాడ పట్టణం: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఆదివారం ప్రతిభ బ్లూమ్స్ పాఠశాల ఆధ్వర్యంలో రక్తదాన ఏర్పాటు చేయడం అభినందనీయం ఎంఈవో సలీంషరీఫ్, ముస్లిం మత పెద్దలు మౌలానా అబ్దుల్ ఖాదిరిషాదీలు అన్నారు. 30 మంది యువకులు రక్తదానం చేసినట్లు తెలిపారు.

విరాళం.. నడిగూడెం: నడిగూడెంలో శ్రీకోదండరామస్వామి దేవాలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కల్యాణ మండప నిర్మాణ పనులకు హుజూర్‌నగర్‌కు చెందిన గెల్లి కృష్ణమూర్తి, సావిత్రమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.15,116లు విరాళంగా అందజేసినట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

ఎన్నిక.. కోదాడ పట్టణం: మున్నూరుకాపు సంఘం నూతన కమిటీని పట్టణ అధ్యక్షుడు మురళి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. కోదాడ పట్టణ అధ్యక్షురాలిగా కృష్ణవేణి, ఉపాధ్యక్షురాలిగా ఎం.దేవి, ప్రధాన కార్యదర్శి గురులక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సులోచన, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రశాంతిలను ఎన్నుకున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి.. నేరేడుచర్ల, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శేఖర్‌రావు కోరారు. నేరేడుచర్ల అరిబండి భవన్‌లో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

ఆత్మరక్షణకు ఆయుధం కరాటే.. కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కోదాడ పట్టణానికి చెందిన విద్యార్థులు వివిధ పతకాలు సాధించినట్లు స్టూడెంట్స్ కోపోఖాన్ కరాటే క్లబ్ కోచ్, తెలంగాణ కోపోఖాన్ ఇన్‌స్ట్రక్టర్ మాధవీలత తెలిపారు. మిర్యాలగూడలో 28న జరిగిన పోటీల్లో వివిధ విభాగాలకు చెందిన 9మంది విద్యార్థులు పతకాలు సాధించారని పేర్కొన్నారు.

☛ ఆత్మరక్షణకు కరాటే ఆయుధంలాంటిదని కిట్స్ కళాశాల ఛైర్మన్ నీలా సత్యనారాయణ అన్నారు. జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో కళాశాలకు చెందిన సింధు, సంధ్య, అఖిలలు బంగారు పతకాలు సాధించడంతో వారిని అభినందించారు.

ఊరేగింపు.. నేరేడుచర్ల: నేరేడుచర్ల అయ్యప్పస్వామి ఆలయం నుంచి ఆదివారం స్వామి వారిని అలంకృత శకటంపై పట్టణంలో ఊరేగించారు. నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో 41 రోజుల పండగ వేడుకల్లో అభిషేకాలు, మహాపూడిపూజ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సినిమాలు కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, సత్యం సుందరం, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** దేవర, **రంగా:** సత్యం సుందరం

నలమాద పురుషోత్తంరెడ్డికి పలువురి నివాళి

హైదరాబాద్‌లో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్: నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డికి పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళి అర్పించారు. పురపాలక సంఘం వైస్ ఛైర్మన్ సంపత్‌రెడ్డి, నాగరాజు పలువురు నాయకులు హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో పురుషోత్తంరెడ్డి భౌతికకాయంపై పూలదండలు ఉంచి నివాళి అర్పించారు.

☛ డీసీసీ ఉపాధ్యక్షుడు షేక్ మహమ్మద్ మన్సూర్ అలీ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. పురుషోత్తంరెడ్డి మరణం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కుటుంబానికి పెద్ద లోటని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మాశెట్టి అనంతరాములు అన్నారు.

పాలకవీడు గ్రామీణం, కోదాడ: టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, బాబు, కృష్ణారావు, గోపాల్, ఎన్వీ సుబ్బారావు, మోతీలాల్, జితేందర్‌రెడ్డి తదితరులు నివాళి అర్పించారు.

ప్రజా పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు: సీపీఎం

బృందావనపురంలో సీపీఎం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు

మోతె, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై పోరాటం జరుపుతున్న కమ్యూనిస్టు పార్టీకి భవిష్యత్తు ఉందని సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యుడు సైదులు అన్నారు. ఆదివారం వివిధ పార్టీల నుంచి సీపీఎంలో చేరిన కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజాపోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం సంతోషంగా ఉందని అన్నారు.

పాలకవీడు గ్రామీణం: మోదీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జమిలి పేరుతో రాద్ధాంతం చేస్తుందని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాశ్ విమర్శించారు. కోమటికుంటలో జరిగిన సమావేశంలో పేర్కొన్నారు.

నడిగూడెం: రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని, వరదలతో పంట నష్టపోయిన వారికి పరిహారం విడుదల చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బృందావనపురంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

గ్రామమంతా కలిసి.. వన భోజనానికి తరలి

చిలుకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంతో పాటు నారాయణపురం గ్రామస్థులు వనభోజన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కుటుంబ సమేతంగా గ్రామ సమీప పొలాల వద్ద గల వనాల్లోకి వెళ్లి వంటలు చేసుకొని భుజించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రతిపాదనలు ఏమాయే?

మేళ్లచెరువు, చింతలపాలెం, న్యూస్‌టుడే: ఈ చిత్రంలో కన్పిస్తున్న కూలిన వంతెన మేళ్లచెరువు-కోదాడ ప్రధాన మార్గంలోనిది. భారీ వర్షాలు, వరదలకు ఈ నెల రెండో తేదీన ఈ వంతెన కూలిపోయింది. దాదాపు వారం రోజుల పాటు ఈ మార్గంలో వాహన రవాణాకు అంతరాయం ఏర్పడింది. ఇటీవలే వంతెన పక్కన ప్రత్యామ్నాయంగా మట్టిదారి వేశారు. ఇంతవరకు ఈ కూలిన వంతెన స్థానంలో మరో కొత్త వంతెన నిర్మాణానికి సంబంధించి ఎలాంటి కదలిక లేదు. ప్రస్తుతం ఈ దారి నుంచే ఆర్టీసీ బస్సులు, లారీలు, ఆటోలు వెళ్తుండగా.. తాత్కాలికంగా పోసిన ఈ మట్టి దారి కూడా ప్రమాద సంకేతాల్ని చూపుతోంది. ఈ సమస్యను ఆర్ అండ్‌బీ డీఈ రమేష్ దృష్టికి తీసుకెళ్లగా కొత్త వంతెనలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

శ్రీమతి & శ్రీ మహ్మద్ అబ్దుల్ లతీఫ్- జానిబేగం గార్లు
GHM, ZPHS(G) హుజూర్‌నగర్ | S.A హిందీ ZPHS(G)- హుజూర్‌నగర్

గత 36 సం॥లుగా విద్యాశాఖలో పనిచేస్తూ ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి, జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీతగా అందరి ఆదరాభిమానాలు పొంది నేడు (GHM ZPHS(G) హుజూర్‌నగర్) ఉద్యోగ విరమణ చేయుచున్న శుభ సందర్భంగా మా నాన్న

శ్రీ అబ్దుల్ లతీఫ్

గారికి హృదయ పూర్వక శుభాకాంక్షలు

కుమారుడు - కోడలు

MD:అబ్దుల్ ఖాలిఖ్ - అస్రు
Software Engineer, USA | Project Manager, USA

కుమారుడు: MD అబ్దుల్ సమీర్
Software Engineer, USA

మరియు బంధుమిత్రుల అభినందనలతో

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

శ్రీమతి & శ్రీ ముత్తినేని లింగయ్య - సత్యావతి గార్లు
S.A.Social, ZPHS (బాలికలు), నడిగూడెం

గత 28 సం॥లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ.. ఎందరో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి అందరి ఆదరాభిమానాలు అందుకొని నేడు 30-9-2024న ఉద్యోగ విరమణ చేయుచున్న మా నాన్న శ్రీ యం.లింగయ్య గారికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

వియ్యంకులు:
పత్తిపాక వెంకటేశ్వర్లు (లేటు)- లక్ష్మి
చిత్తలూరి వెంకటేశ్వరరావు - జయలక్ష్మి
Rtd. టీచర్

కుమార్తె- అల్లుడు

పత్తిపాక లింగారావు - అఖిల
మనుమరాలు: ఈక్షిత

కుమారుడు-కోడలు

ముత్తినేని అవినాష్- సౌజన్య
మనుమరాలు: వేదాన్విక

(c) eenadu

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

శ్రీసూర్య క్షేత్రానికి భక్తుల తాకిడి

తిమ్మాపురంలోని శ్రీ సూర్య క్షేత్రంలో నవోదయ విద్యార్థులు

తిమ్మాపురంలోని శ్రీఅఖండ జ్యోతి స్వరూప సూర్య నారాయణస్వామి ద్వాదశ ఆదిత్యాది క్షేత్రానికి ఆది వారం కావడంతో భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యాపేటలోని నవోదయ విద్యార్థులు స్వామిని దర్శించుకున్నారు. క్షేత్ర విశిష్ట తను సౌర ఆరాధకుడు జనార్దనస్వామి వివరించారు. ఘనపురం నరేష్, అర్చకులు వికాస్ పాండే, అంకితా పాండే, శ్రీరామ్ పాండే పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, జాజిరెడ్డిగూడెం

నిరసన పాదయాత్రను విజయవంతం చేయండి

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ ప్రసాదంలో జరిగిన కల్తీపై ప్రతి హిందువు పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని

సూర్యాపేటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ధార్మిక ఐక్యవేదిక సభ్యులు

శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. సోమవారం సాయంత్రం వేణుగోపాలస్వామి ఆలయం నుంచి పాదయాత్ర చేపడుతున్నామని అధిక సంఖ్యలో హిందూ సోదరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. హిందూ ధార్మిక సంఘాల ఐక్య వేదిక, విశ్వహిందూ పరిషత్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో తిరుగుబాటు తప్పదు: జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: ప్రజల జీవితాలతో ఆడుకుంటామంటే సహించేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఇందిరానగర్, నెహ్రూనగర్ బాధితులను ఉద్దేశించి ఆదివారం మాట్లాడారు. భారాస ప్రజలకు అండగా ఉంటే, సీఎం రేవంత్‌రెడ్డి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి, సంక్షేమాలు మరిచి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరాచకాలు చేస్తుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని విమర్శించారు. ప్రాణం పోయినా ప్రజలకు అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇచ్చారు.

ఆటల్లో ఆడితేరుతున్నారు..!

ఎస్‌జీఎఫ్ తరఫున ఆరు ప్రథమ బహుమతులు సాధించిన ఆత్మకూర్(ఎస్) బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పులే బీసీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు గత మూడేళ్లుగా ఆటల్లో రాణిస్తున్నారు. మండల నుంచి రాష్ట్రస్థాయి వరకు అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటుతూ బహుమతులు గెలుచుకుంటున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ జెల్లా వెంకటేశ్వర్లు అందిస్తున్న ప్రోత్సాహం, వ్యాయామ ఉపాధ్యాయుడు సోమపంగు లెనిన్ శిక్షణలో విద్యార్థులు ఆటల్లో ఆరితేరుతున్నారు.

ప్రోకబడ్డీకి ఎంపిక కావడమే లక్ష్యం..

– మంచాల అక్షయ్‌కుమార్, పదో తరగతి, బీసీ గురుకుల ఆత్మకూర్(ఎస్)

కబడ్డీలో ఆరో తరగతి నుంచే సాధన చేస్తున్నా. పాఠశాల తరఫున అండర్-14 విభాగంలో 2023-24 విద్యా సంవత్సరంలో జనగామలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించా. ప్రోకబడ్డీకి ఎంపిక కావడమే లక్ష్యం.

ప్రథమంగా నిలిచేందుకు కృషి చేస్తా..

– షేక్ నయూమ్

లాంగ్‌జంప్, 100మీటర్ల పరుగుపందెం పోటీల్లో పాల్గొన్నా. అథ్లెటిక్స్ అసోసియేషన్ తరఫున రాష్ట్రస్థాయిలో బహుమతులు గెలిచా. జాతీయస్థాయిలో ప్రథమ బహుమతులు సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తా.

భారత జట్టుకు ఆడతా..

– మోతె చైతన్

జనగామలో నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడోత్సవాల్లో అండర్-14 కబడ్డీ బృందం తరపున పాల్గొని రన్నరప్‌గా నిలిచా. మల్లారెడ్డిగూడెంలో జాతీయ కబడ్డీ పోటీల్లో సబ్‌జూనియర్ విభాగంలో జిల్లా తరపున ఆడా. ఇండియా కబడ్డీ టీంకు ఎంపికయ్యేందుకు కృషి చేస్తా.

వాలీబాల్‌లో జాతీయస్థాయిలో రాణిస్తా..

– బర్మావత్ భానుప్రసాద్

వాలీబాల్ ఆటంటే ఎంతో ఇష్టం. నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన వాలీబాల్(అండర్-14 విభాగంలో) పోటీల్లో సెమీ ఫైనల్ దాకా వెళ్లా. ఎస్‌జీఎఫ్ తరపున డివిజన్, ఉమ్మడి జిల్లా స్థాయిలో బహుమతులు గెలుచుకున్నా. ఎప్పటికైనా జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికవుతా.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)

సూర్యాపేట: 9154395978

తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని విద్యానగర్‌లో రోడ్లపక్కన చెత్త దర్శనమిస్తోంది. సెలవురోజుల్లో చెత్తను అధ్వానంగా పారబోస్తున్నారు. అపరిశుభ్రంగా మారడంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. – గణేష్, సూర్యాపేట

✔ వెంటనే సిబ్బందితో తరలిస్తాం.

– సురేష్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్, సూర్యాపేట

తిరుమలగిరి, న్యూస్‌టుడే:

? తిరుమలగిరి పుర పరిధిలోని తిరుమలహిల్స్‌లో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లోకి మురుగునీరు పదలడం ద్వారా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

– జి.శ్రీనివాస్, తిరుమలగిరి

✔ మురుగుకాల్వలు, సీసీరోడ్ల నిర్మాణం కోసం టెండర్లు పూర్తయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. అప్పటి వరకు తాత్కాలిక పనులు చేపడతాం. – ఎం.బుచ్చిబాబు, ఇన్‌ఛార్జ్ పుర కమిషనర్, తిరుమలగిరి

సామూహిక జన్మదిన వేడుకలు

భానుపురి, న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమాలతో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సుదర్శన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో

సూర్యాపేటలో సామూహిక జన్మదిన వేడుకల్లో విశ్రాంత ఉద్యోగులు

సూర్యాపేట మండల శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరులో జన్మించిన వారికి సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించి మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వి.రాములు, హమీద్‌ఖాన్, ఎస్.నాగేశ్వరావు, లక్ష్మీకాంతరెడ్డి, వీరయ్య, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

మద్దిరాల, న్యూస్‌టుడే: భూ తగాదాలు పరిష్కారం కావడం లేదని మనస్తాపానికి గురై పురుగు మందు తాగిన ఓ రైతు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానికులు, సీఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుక్కడం ఆవాసం రాజగానితండాలో లకావత్ రెడ్యా, అన్నదమ్ముల కుమారులైన లకావత్ శ్రీను(26), లకావత్ రవిల మధ్య గత పదిహేనేళ్లుగా భూ వివాదాలు జరుగుతున్నాయి. దీనిపై ఇరువర్గాలపై కేసులు నమోదు, పలుమార్లు తండాలో పంచాయితీలూ నిర్వహించారు. కాగా శనివారం శ్రీను పత్తిపంటను తీసేందుకు కూలీలను తీసుకురాగా రెడ్యా, అతని కుమారుడు అడ్డుకని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో కూలీలు పత్తి తీయకుండా వెళ్లిపోయారు. దీంతో శ్రీను మనస్తాపం చెంది తన కుమారుడు(1), కుమార్తె(3)లతో చివరి క్షణాలు గడిపి తన వ్యవసాయ క్షేత్రంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ఆసుపత్రిలో అనంతరం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకురాగా.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నాగారం సీఐ రవీందర్‌రెడ్డి, ముగ్గురు ఎస్సైలతో కలిసి గ్రామంలో మోహరించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.వీరన్న తెలిపారు.

లకావత్ శ్రీను

న్యాయమైన వినతులను వెంటనే పరిష్కరించాలి

సూర్యాపేట: మహాసభలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

సూర్యాపేట(మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఐదో మహాసభలో ఆయన మాట్లాడారు. వెబ్ కౌన్సిలింగ్ పారదర్శకతతో నష్టపోయిన ఉపాధ్యాయుల న్యాయమైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలో ఉన్న మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. తొలుత టీఎస్ యూటీఎఫ్, జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు నన్నపోయిన సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు, నరసరాజు, ఉపేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగమణి, అనిల్‌కుమార్, ఎల్ల సైదులు పాల్గొన్నారు.

వాట్సప్ గ్రూప్ సభ్యుల సాయం

నూతనకల్: నకిరేకల్‌కు చెందిన పుష్పలత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న మండల కేంద్రానికి చెందిన 'జనం కోసం మనం' వాట్సప్ గ్రూప్ సభ్యులు ముందుకొచ్చి బాధితురాలి భర్త ఆంజనేయులును నూతనకల్‌కు పిలిపించి ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. రేసు రవి, గంట నాగయ్య, జానయ్య, మురళి, ఉపేందర్ తదితరులున్నారు.

పెద్దిరెడ్డి రంగారావు చిరస్మరణీయులు

సూర్యాపేటలో పెద్దిరెడ్డి సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

కుడకుడ రోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: పెద్దిరెడ్డి రంగారావు చిరస్మరణీయులని మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలో ఆదివారం సీపీఐ రాష్ట్రకమిటీ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సంస్మరణ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ శాసనమండలి ఛైర్మన్ నేతి విద్యాసాగర్‌రావు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ వైస్ జడ్పీ ఛైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

సూర్యాపేట(మహాత్మాగాంధీ రోడ్డు): ఉన్నతమైన విలువలతో విద్యాబుద్ధులు నేర్పించిన గొప్ప విద్యాదాత సత్తార్ సార్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సత్తార్ సంతాప సభకు హాజరై ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.

రహదారి పక్కనే.. చెత్త

సూర్యాపేటలోని కృష్ణాకాలనీలో రహదారి పక్కన చెత్త పారబోస్తున్నారు. నివాస గృహాల వారితోపాటు, దుకాణాలవారు ఖాళీ స్థలంలో చెత్తవేసి అపరిశుభ్రంగా మారుస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యర్థాలు తడిసి దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. రాత్రి సమయంలో గాలికి దుర్వాసన వ్యాపిస్తుండటంతో చుట్టుపక్కల నివాస గృహాలవారు ఇళ్లలో ఉండలేకపోతున్నారు. కృష్ణాకాలనీ ప్రధాన రోడ్డు కుడకుడ రోడ్డుకు దగ్గరలో ఉంటుంది. ఇక్కడి నుంచి మానసనగర్, జాతీయ రహదారికి ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. దుకాణదారులు, నివాస గృహాల వారు పారబోసే చెత్త కారణంగా అపరిశుభ్రంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. పుర కమిషనర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా కాలనీవాసులు రహదారి పక్కన ఖాళీ స్థలంలో చెత్తపారబోయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే

అలనాటి మధుర జ్ఞాపకాలతో..

నూతనకల్: నాగార్జున ఉన్నత పాఠశాలలో..

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: 25 ఏళ్ల క్రితం అనుకున్న లక్ష్యాలను సాధించాలని వెళ్లి.. అనుకున్నట్లు జీవితంలో ఎదిగి.. అందరూ ఒక్కచోట కలిసి.. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకునేందుకు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు(1998-1999) ఆనందంగా గడిపారు. తమ ఉన్నతికి పునాదులు వేసిన గురువులను సత్కరించారు. కరస్పాండెంట్ మారగాని విజయలక్ష్మి, బొక్క వీరారెడ్డి, దీన్‌దయాల్‌రెడ్డి, సోమిరెడ్డి, ఆర్.లింగయ్య, శ్యాం, శరత్, విద్యార్థులు ఉపేందర్‌రెడ్డి, రామ్మూర్తి యాదవ్, దేవేందర్, కవిత, ఉమ, సంధ్య, లక్ష్మి, రమణ, లక్ష్మణ్, రాజశేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

గోరెంట్లలో..

మద్దిరాల గ్రామీణం: మండలంలోని గోరెంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం అలరించింది. 1991-96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆనాటి గురువులను సన్మానించి, గత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని చిన్నారులుగా మారిపోయి ఆటపాటలతో సందడి చేశారు.

హామీలు అమలు చేయాలి

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కష్ట జీవుల హక్కుల సాధన కోసం ఉద్యమించేది సీపీఎం అని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం పేర్కొన్నారు. తిమ్మాపురం గ్రామంలో పార్టీ మహాసభ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, అవిలయ్య, అబ్బులు, సైదులు, వెంకన్న, రాజయ్య పాల్గొన్నారు.

తిమ్మాపురంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మద్దిరాల, న్యూస్‌టుడే: బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు అన్నారు. చిన్ననేమిల గ్రామానికి చెందిన పులుసు వెంకటేష్‌కి రూ.40,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం అందజేసి మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి వెంకన్న, నజీర్ ఖాన్, చెన్ను నాయక్, రాములు నాయక్, నాయకులు పాల్గొన్నారు.

తాటిపాములలో విషాదఛాయలు

తిరుమలగిరి, న్యూస్‌టుడే: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తంరెడ్డి ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో కన్ను

తిరుమలగిరిలో పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గ్రామస్థులు

మూశారు. ఆయన స్వగ్రామం మండలంలోని తాటిపాముల. ఆయన మరణవార్త తెలిసి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో ఆయనతో వారికున్న జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గ్రామంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి, అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఎర్ర యాదగిరి, బోయపల్లి కిషన్, కారుపోతుల అంజయ్య, ఎర్ర శ్రీను, చెరుకు సోమయ్య, యల్లయ్య తదితరులున్నారు.

పూడ్చడం మరిచారు..!

తిరుమలగిరి పుర పరిధిలో నందాపురానికి వెళ్లేదారిలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావటంతో మరమ్మతులు చేసేందుకు ఇటీవల గుంతను తవ్వి పూడ్చడం మరిచారు. దీంతో దారిలో వెళ్లేవారికి ఇబ్బందిగా మారింది. రాత్రివేళలో కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వెంటనే గుంతను పూడ్చి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ ఎం.బుచ్చిబాబును అడగగా.. సిబ్బందిని పంపించి పూడ్చివేయిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, తిరుమలగిరి

కోతుల పేరు చెప్పి.. చెట్లను నరికివేసి

మద్దిరాల, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్సారెస్పీ కాలువల వెంట ఏపుగా పెరిగిన చెట్లను అక్రమార్కులు ఇష్టానుసారంగా నరికి వేస్తున్నారు. కోతుల బెడద ఉందనే సాకుతో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా చెట్లను నరికి బొగ్గుబట్టీలకు తరలిస్తున్నారు. పోలుమళ్ల శివారులో చెట్లు నరికివేయడంతో కాల్వల మోడులతో దర్శనమిస్తున్నాయి. 'సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి కాలువ వెంట చెట్లను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామ'ని ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి తెలిపారు.

సత్యశోధక్ సమాజ్‌తోనే చైతన్యం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: జ్యోతిబాపులే 151 ఏళ్లక్రితం స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ద్వారానే దళితుల్లో సామాజిక చైతన్యం వచ్చిందని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు అల్లగుబెల్లి వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్‌లో ఆదివారం నిర్వహించిన కుల నిర్మూలన ఆచరణాత్మక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళితుల్లో నేటికి వివక్షత కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు. పీపీడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సక్క, పీపీడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు అలుగుబెల్లి వాణి, పోతురాజు ప్రతాప్, బాదె రాములు, వెంకటమ్మ, పిచ్చమ్మ, లింగమ్మ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో సమస్యల తిష్ఠ

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణం రాజీవ్‌నగర్‌లోని ఆదిజాంభవుల శ్మశాన వాటికలో సమస్యలు తిష్ఠవేశాయి. నీటి సమస్యతో పాటు సరైన వసతులు లేక దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది ఈ శ్మశాన వాటికు మరమ్మతు చేపట్టారు. గుత్తేదారు తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకొన్నారు. విరిగిపోయిన నల్లాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి నీటి వసతి కల్పించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. 'శ్మశాన వాటికను పరిశీలించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామ'ని పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

16 కిలోల గంజాయి పట్టివేత

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలపై గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను మణుగూరు సమీపంలో ఆదివారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్సైజ్ శాఖ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా స్థానిక రథంగుట్ట అర్బన్ పార్కు సమీపంలో తనిఖీలు చేపట్టారు. మూడు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేశారు. వారి నుంచి రూ.4 లక్షల విలువైన 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో జగిత్యాలకు చెందిన అరవింద్, లక్ష్మణ్, సూర్యాపేటకు చెందిన గోపి, రమేష్, టేకులపల్లికి చెందిన సాయికుమార్, నవీన్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి చరవాణులతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన వారిపై కేసు నమోదు

చివ్వెంల, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలో కుడకుడలో గల స్థిరాస్తి వ్యాపారంలో మనస్పర్థలు ఏర్పడి తన భాగస్వామి మరి కొందరితో కలిసి బెదిరిస్తున్నాడంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బి.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థిరాస్తి వ్యాపారులైన అంతటి విజయ్, గోరుగంటి రవీందర్‌రావు ఇద్దరు కలిసి వ్యాపారం చేస్తున్నారు. కొంతకాలం క్రితం ఇద్దరి మధ్యన మనస్పర్థలు వచ్చి విడిపోయారు. వీరి లావాదేవీల్లో భాగంగా రవీందర్‌రావు తాను ఇవ్వాల్సిన నగదులో రూ.3.58 కోట్లు ఇచ్చాడు. మరో రూ.1.30 కోట్లు ఇవ్వాల్సి ఉంది. వీటిని ఇచ్చేందుకు ఆలస్యం కావడంతో విజయ్ తన బావమరిది, మరో ఇద్దరితో కలిసి రవీందర్‌రావును బెదిరింపులకు పాల్పడుతుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆదివారం తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బొడ్డెమ్మ.. బొడ్డెమ్మ వలలో..

నూతనకల్: వెంకేపల్లిలో బొడ్డెమ్మ వేడుకల్లో మహిళలు

నూతనకల్, న్యూస్‌టుడే: బతుకమ్మ వేడుకలకు ముందు తొమ్మిది రోజులు మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఇష్టంగా జరుపుకొనే బొడ్డెమ్మ పండగను మండలంలోని వెంకేపల్లిలో శ్రీసీతారామచంద్ర ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్నారు. పీటబొడ్డెమ్మగా పేరు పెట్టి ఏడోరోజు(ఆదివారం) వేడుకను పూర్తిచేశారు. మహిళలు సాయంత్రం ఆలయ ప్రాంగణానికి చేరుకొని ఆటపాటల్లో నిమగ్నమయ్యారు. రజిత, మంగతాయమ్మ, పద్మ, కళమ్మ, తీపిరెడ్డి పద్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

తడారని గోడలు.. శిథిలావస్థలో పైకప్పు

సోమ్లాతండా గ్రామపంచాయతీ భవనం చుట్టూ అల్లుకుపోయిన చెట్లు

పైకప్పులో వర్షపునీటి తేమ

నూతనకల్ మండలం సోమ్లాతండా గ్రామపంచాయతీ భవనం చుట్టూ నాటిన మొక్కలు పెరిగి పెద్దవిగా ఎదిగి సచివాలయాన్ని అల్లుకుపోయాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనానికి ఎండ తగలకపోవడంతో పైకప్పు, గోడలపై వర్షపు నీటి తేమతో ఎక్కువ కాలం ఉంటోంది. గోడలు, స్లాబ్, సబ్జాలు పాకురు పట్టి తేమ ఆరకుండా ఉండటంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. 'చెట్ల కొమ్మలు తొలగించి భవనానికి ఎండ తగిలేలా చూస్తామ'ని గ్రామ పంచాయతీ కార్యదర్శి బోయిళ్ల వెంకన్న 'న్యూస్‌టుడే'కు వివరించారు.

– నూతనకల్, న్యూస్‌టుడే

గుండె వ్యాధులపై అప్రమత్తత అవసరం

సూర్యాపేట(తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: గుండె జబ్బులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ గుండె వ్యాధుల నివారణ నిపుణులు డాక్టర్ అలుక ప్రేమ్‌కుమార్ సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని(వరల్డ్ హార్ట్ డేను)పురస్కరించుకొని ఆదివారం శ్రీశ్రీనగర్‌లోని ఆర్వీ ఆసుపత్రిలో నిర్వహించిన మెగా గుండె వైద్య శిబిరంలో రోగులను పరీక్షించి మాట్లాడారు. గుండెలో వచ్చే మంటను కొందరు గ్యాస్ సమస్యగా భావించి మందులు వాడతారని, నయం కాకపోవడంతో వైద్యుడిని సంప్రదిస్తుంటారన్నారు. కానీ అప్పటికే ఆసల్యం కావడంతో గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. గుండె జబ్బుకు గురైన రోగిని సకాలంలో ఆసుపత్రికి తీసుకొస్తే చికిత్స చేసి బతికించే అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ కాంతారావు, డాక్టర్ రమేశ్, డాక్టర్ బెల్లంకొండ ప్రియాంక, బెల్లంకొండ రామ్మూర్తి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి హాజరైన రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రేమ్‌కుమార్

(c) eenadu